భగత్‌సింగ్ యువజన సంఘం కమిటీ ఎన్నిక

కార్యవర్గ సభ్యులతో సీఐటీయూ జిల్లా నాయకుడు పెంటయ్య

కడ్తాల్, మార్చి 9: తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో భగత్‌సింగ్ యువజన సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం గ్రామాధ్యక్షుడిగా మహేశ్, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్, మహేశ్, ప్రధాన కార్యదర్శిగా రవి, సహాయ కార్యదర్శులుగా శ్రీకాంత్, శివ కుమార్, సలహాదారుడిగా రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు పెంటయ్య, రైతు సంఘం జిల్లా నాయకుడు రమేశ్, మహేశ్, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలి

లేబర్ కార్డులు అందజేస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 9: మున్సిపాలిటీ పరిధి రావినారాయణరెడ్డి కాలనీలో సీపీఐ కార్యాలయంలో లేబర్ కార్డులు, ఇన్సూరెన్స్ కార్డులు పంపిణీ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీరా హరిసింగ్‌నాయక్, దాసరి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర నేతలు ముత్యాల యాదిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి కార్మికుడికి, వారి పిల్లలకు ఉచిత వైద్యం, విద్యను అందించాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ప్రతి కార్మిక కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని కోరారు. మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్, కాలనీ ప్రతినిధులు శేఖర్, నిరంజన్, వెంకటేశ్, రవి, నీలాబాయి, రవళి, షైన్, జ్యోతి, రాజు పాల్గొన్నారు.

వాంతులు, విరేచనాలతో అస్వస్థత

కుంట్లూరులోని ఓ కార్పొరేట్ ఐఐటీ క్యాంపస్‌లో ఘటన

పెద్దఅంబర్‌పేట, మార్చి 9 : కుంట్లూరులోని ఓ కార్పొరేట్ ఐఐటీ క్యాంపస్‌లో ఆదివారం ఉదయం టిఫిన్ తిన్న తర్వాత దాదాపుగా 70 మంది విద్యార్థినులకు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో ఫుడ్ పాయిజన్ జరిగి అస్వస్థతకు గురయ్యారు. అప్రమత్తమైన క్యాంపస్ ప్రతినిధులు కొబ్బరి బొండాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో వైద్యులను క్యాంపస్‌కు రప్పించి వైద్య సేవలు అందించినట్టు తెలుస్తున్నది. తీవ్ర అస్వస్థతకు గురైన పలువురు విద్యార్థినులను హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందించినట్టు సమాచారం. హయత్‌నగర్ సీఐ నాగరాజు గౌడ్ ఆ క్యాంపస్‌కు వెళ్లి విచారించారు. స్థానిక విలేకరులతో కలిసి కాలేజీలోని తరగతి గదుల్లో చదువుతున్న విద్యార్థినులను ఆరా తీశారు. 70 మందికిపైగా విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ అయినట్లు విద్యార్థినులు స్వయంగా చెప్పడం గమనార్హం. పిల్లలకు ఫుడ్ పాయిజన్ జరిగినా తమను కాలేజీ లోపలికి అనుమతించడంలేదని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. అదేవిధంగా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కొహెడలో ఉన్న ఓ కార్పొరేట్ క్యాంపస్‌లోనూ శనివారం రాత్రి పదుల సంఖ్యలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయినట్టు తెలుస్తున్నది. అస్వస్థతకు గురైన విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం దవాఖానకు తరలించినట్టు తెలుస్తున్నది.

పది మేకల అపహరణ.. కేసు నమోదు

కేశంపేట, మార్చి 9: రాత్రి సమయంలో దుండగులు పది మేకలను అపహరించుకెళ్లిన ఘటన కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లాలయ్య మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడని, రోజుమాదిరిగానే తన ఇంటివద్ద మేకల పాకలో శనివారం రాత్రి మేకలను కట్టేశాడని, గుర్తు తెలియని దుండగులు 10మేకలను అపహరించుకెళ్లారన్నారు. నిద్ర లేచిన లాలయ్య చూసే సరికి కారులో మేకలను తరలిస్తుండడం గమనించినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరహరి తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నరహరి

కేశంపేట, మార్చి 9: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం వేములనర్వ గ్రామ పంచాయతీ పరిధిలోని చౌదరిగూడ గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారని, ఈ మేరకు గ్రామ కార్యదర్శి లక్ష్మీప్రసన్నకు చెప్పడంతో ఆమె స్థానికుల సాయంతో ఘటనా స్థలానికి వెళ్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని సీఐ నరహరితో పాటు పోలీసులు పరిశీలించగా తల, మొండెం వేర్వేరుగా పడి ఉన్నాయన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో గుర్తుపట్టలేనివిధంగా తయారైందని, ప్రమాద స్థలాన్ని క్లూస్ టీం సహాయంతో పరిశీలించగా మృతుడి వద్ద ఆధార్‌కార్డు లభించిందన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామానికి చెందిన బేరి జంగయ్య పేరున ఉన్న ఆధార్‌కార్డును గుర్తించామని, కొంతకాలంగా అతడు మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ దవాఖానకు తరలించారు. గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

బీఆర్ఎస్ హయాంలో రూ.30కోట్ల నిధులు మంజూరు
సంతోషం వ్యక్తం చేస్తున్న పలు గ్రామాల ప్రజలు

ఇబ్రహీంపట్నం, మార్చి 9 : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత రోడ్లను పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారు. అందులో భాగంగానే ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్‌గూడ నుంచి రాచులూరు వరకు సింగిల్‌రోడ్డుగా ఉన్న ఈ రోడ్డును రెండువరుసల రోడ్డుగా విస్తరించటం కోసం సీఆర్ఐఎఫ్ నిధులు రూ.30కోట్లు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి విడుదల చేయించారు. చర్లపటేల్‌గూడ, తుర్కగూడ, కప్పాడు, ఎలిమినేడు, జబ్బార్‌గూడ, తిమ్మాపూర్ గ్రామాల మీదుగా రాచులూరు వరకు ఈ రోడ్డును విస్తరిస్తే ఈ గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్న ఆయా గ్రామీణ ప్రాంతాల ప్రజల సూచన మేరకు ఈ నిధులు విడుదల చేయించారు. ఎన్నికల సమయం నాటిని ఈ నిధులు విడుదలై సిద్ధంగా ఉన్నప్పటికీ రోడ్డు పనులు చేపట్టంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. గత నాలుగురోజులుగా ప్రారంభమైన ఈ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో తుర్కగూడ, కప్పాడు, చర్లపటేల్‌గూడ, ఎలిమినేడు, జబ్బార్‌గూడ, తిమ్మాపూర్ గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రవాణా సౌకర్యం సులభతరంగా మారటంతో పాటు ఈ రోడ్డు పనులు పూర్తయితే త్వరగా ఇబ్రహీంపట్నం చేరుకునే వీలుంటుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గత ప్రభుత్వం చేపట్టిన రోడ్ల పనులు తప్పా...ప్రస్తుతం ప్రభుత్వం రోడ్ల పనులతో పాటు, ఏ ఒక్క అభివృద్ధి పనిని కూడా పట్టించుకోవటం లేదని ఆయా గ్రామీణ ప్రాంతాల ప్రజలు తెలుపుతున్నారు.

ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్‌గూడ రోడ్డు నుంచి రాచులూరు వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

ప్రయాణం సులభతరం

ఈ రోడ్డు పనులు పూర్తయితే ప్రయాణం సులభతరంగా మారనుంది. గత ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నం ప్రాంతంలో రోడ్ల విస్తరణకు కోట్లాది రూపాయల నిదులు కేటాయించారు. కాని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులకు ఎక్కడకూడా తట్టెడు మట్టి పోయలేదు. ప్రస్తుత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే గత ప్రభుత్వంలో మంజూరైన నిధుల ద్వారానే శిలాఫలకలు వేసుకుని కాలం వెల్లదీస్తున్నారు. కాని, అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయించటలేదు. నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరిగాయి.

- నిట్టు జగదీశ్వర్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు

గత ప్రభుత్వ హాయాంలోనే నిధులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ రోడ్డు పనులకు నిధులు విడుదలయ్యాయి. చర్లపటేల్‌గూడ నుంచి రాచులూరు వరకు రోడ్డును విస్తరించటం కోసం నిధులు కేటాయించటంతో ప్రస్తుతం ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ రోడ్డు విస్తరణకు కృషిచేసిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

- ఏనుగు భరత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తుర్కగూడ

షాద్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిద్దిదుతా

షాద్‌నగర్‌రూరల్, మార్చి 9: మున్సిపాలిటీలోని వార్డుల్లో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలోని 17వ వార్డులో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ.10లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, సర్వర్‌పాషా, ప్రకాశ్‌గౌడ్, చెన్నయ్య, బస్వం, అప్పి, నాయకులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కేశంపేట : మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. మండలంలోని పాపిరెడ్డిగూడలో ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ, ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో చేపట్టే ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్యాయాదవ్, మాజీ జెడ్పీటీసీ విశాల, పార్టీ మండల అధ్యక్షుడు వీరేశం, నాయకులు కృష్ణారెడ్డి, శివయ్య, బాలరాజు, రామచంద్రయ్య, జగదీశ్వర్, లక్ష్మయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తుర్కయాంజాల్, మార్చి 9 : మహిళలు ఆర్థిక అభివృద్ధితో పాటు సమాన హక్కులను సాధించినప్పుడే మహిళా సాధికారత సాధిస్తారని సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఆదివారం మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ సుందరయ్య నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇండ్ల కేటాయింపులో వివక్ష

మొయినాబాద్, మార్చి 9 : పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించడంలో ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భాస్కర్ అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూలో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఖజానాతో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే పేదలకు కేటాయించాలని సూచించారు. ఇండ్ల నిర్మాణం పూర్తి అయినప్పటికీ విద్యుత్, తాగునీటి సౌకర్యంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి పేదలకు పంపిణీ చేయాలన్నారు. ఇలాగే అధికారులు నిర్లక్ష్యం చేస్తే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. వెంటనే హౌసింగ్ శాఖ, రెవెన్యూ అధికారులు కలుగజేసుకుని ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి దేవేందర్, మొయినాబాద్ మండల కన్వీనర్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్, నాయకులు ప్రభుదాస్, సీఐటీయూ నాయకులు రత్నం, మహేందర్, రవి, అజిజ్, నరసింహ్మ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

కేశంపేట, మార్చి 9: మండలంలోని భైరోన్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలను మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ ఆదివారం ప్రారంభించారు. లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న బండలాగుడు పోటీల్లో ప్రథమ బహుమతి విజేతకు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రూ.75వేలను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్‌రావు, మాజీ సర్పంచ్‌లు యాదగిరిరావు, యాదగిరి, కృష్ణయ్య, వెంకటయ్య, లక్ష్మీనారాయణ, నాయకులు ప్రేమ్‌కుమార్‌గౌడ్, జమాల్‌ఖాన్, సాజిద్, వేణు, ద్రోణాచారి, బాబు, యాదగిరి, భాస్కర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతికి కారణమైన ముగ్గురి రిమాండ్

ఆమనగల్లు, మార్చి 9: మహిళ మృతికి కారణమైన ముగ్గురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించిన ఘటన ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పులిగోనిపల్లి తండాకు చెందిన బుజ్జి కూతురు ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నది. కూతురు వివాహానికి పక్కింటికి చెందిన బాణావత్ దేవి కుటుంబ సభ్యులే కారణమని నిందిస్తూ.... బుజ్జి తరుచూ వారితో గొడవలు జరిగేవి. దీంతో మనోవేదనకు గురైన దేవి శుక్రవారం ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిందని ఎస్ఐ తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దేవిని చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. దేవి మృతికి కారణమైన బుజ్జి, జెన్నీ, తార్యాను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు..

కేశంపేట, మార్చి 9: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదానం చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ ప్రతినిధులు రాజు, మురళీ, ప్రభు అన్నారు. కేశంపేట మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో డప్పు శివకుమార్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువతీ యువకులు రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన 22మంది యువకులను రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మనోహర్, రవీందర్, ప్రభాకర్, మల్లేశ్, గోపాల్, ప్రశాంత్, ప్రభాకర్, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మంచాల, మార్చి 9: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం నిరంతరం కృషి చేస్తుందని రంగారెడ్డి జిల్లా కార్యదర్శి యాదయ్య అన్నారు. మండల పరిధిలోని జాపాల గ్రామంలో శనివారం రాత్రి కామ్రేడ్ కోటప్ప స్మారక కేంద్రాన్ని ఆయన పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో యాదయ్య మాట్లాడుతూ కామ్రేడ్ కోటప్ప జాపాల గ్రామానికి 35సంవత్సరాల పాటు సర్పంచ్‌గా పనిచేయడమే కాకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి కోటప్ప అని కొనియాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జంగయ్య, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుమలత, జాపాల కార్యదర్శి పాపిరెడ్డి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

మొయినాబాద్, మార్చి 9 : ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. ఆదివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజాగూడ గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతుల పట్ల ఏ మాత్రం వివక్షత చూపరాదని అన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు.రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, సబ్సిడీ విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ్ మండల కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, నరసింహ్మారెడ్డి, ముకుందరెడ్డి, సత్యనారాయణ, విజయ రాజు, గణేష్, తిరుమలయ్య, ఆదిరెడ్డి, రమేష్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పాపిరెడ్డిగూడలో లక్ష సంతకాల సేకరణ

కేశంపేట, మార్చి 9: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగుల ప్రాతినిధ్యంకోసం అసెంబ్లీలో చట్టం చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మండల ఉపాధ్యక్షుడు సూర మోని యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ఆదివారం లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌ల్లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేయడానికి వీలుగా ప్రత్యేక చట్టం చేయాలన్నారు. అసెంబ్లీలో ప్రత్యేక చట్టం కోరుతూ మార్చి 1నుంచి 30వరకు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రస్తుతం రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టం పెట్టి దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, శంకరయ్య, మల్లయ్య, ఎండీ.పాశ, రఘు, ఆంజనేయులు, బాల్‌రాజ్, శంకరయ్య, శివలింగం పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం మారుతీనగర్ కాలనీలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.

- పెద్దఅంబర్‌పేట, మార్చి 9

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కొందుర్గు, మార్చి 9: విద్యుత్ షాక్‌కు గురై రెండు కాళ్లు, చేతులు కోల్పోయిన వ్యక్తి కుటుంబానికి మండలానికి చెందిన స్థానిక విలేకరి ఆర్థికసాయాన్ని అందజేశారు. మండలంలోని ఆగిర్యాల గ్రామానికి చెందిన బ్యాగరి ఆంజనేయులు కూలీ పనులు చేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్సకోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు రెండు కాళ్లు, చేతులను తొలగించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక విలేకరి వెంకటయ్య బాధిత కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. దాతలు స్పందించి ఆంజనేయులు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

గంప ప్రవీణ్ అంతిమయాత్ర నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

కేశంపేట, మార్చి 9: అమెరికాలో దుండగులు జరిపిన కాల్పుల్లో ఈ నెల 5న మృత్యువాత పడ్డ గంప ప్రవీణ్‌కు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు. అమెరికా నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆదివారం తెల్లవారుజామున వచ్చిన గంప ప్రవీణ్ పార్థివదేహాన్ని భారత రాయబార కార్యాలయ ప్రతినిధులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. శంషాబాద్ నుంచి నేరుగా కేశంపేట మండల కేంద్రానికి తరలించి ప్రవీణ్ నివాసంలో కుటుంబ సభ్యుల సందర్శనార్థం కొద్దిసేపు ఉంచారు. కేశంపేట మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, పాలమూరు చారిట్రబుల్ ట్రస్ట్ అధినేత విష్ణువర్ధన్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాళులర్పించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

మొయినాబాద్, మార్చి 9 : మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన సీఆర్ఆర్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆదివారం ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మోత్కుపల్లి రాములు పరిశీలించి నాణ్యతను పాటించాలని సూచించారు. నాణ్యత లోపిస్తే బిల్లులు కూడా ఆలస్యం అవుతాయని కాంట్రాక్టర్‌కు సూచించారు. వారితో పాటు గ్రామస్తులు సునీల్‌కుమార్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదిబట్ల, మార్చి 9: పేకాట స్థావరంపై ఎస్ఓటీ మహేశ్వరం పోలీసుల సహకారంతో ఆదిబట్ల పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి 8 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తుర్కయాంజాల్ బ్రాహ్మణపల్లి రోడ్డుగణేశ్ నగర్ కాలనీ పరిధిలో ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నారని సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు ఆదిబట్ల పోలీసులు సహకారంతో దాడి చేసి అందులో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి వారినుంచి రూ.93వేల 140 నగదు, 4 సెట్ల ప్లేయింగ్ కార్డులు, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

వర్గీకరణ అమలు చేయాలి

కొందుర్గు, మార్చి 9: ఎస్సీ వర్గీకరణ అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ కొందుర్గు మండల అధ్యక్షుడు ఆనంద్‌మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రూప్-1, గ్రూప్ -2, గ్రూప్ -3 ఫలితాలను విడుదల చేయడం తగదని, వర్గీకరణ చట్టం అమలు చేయకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తే ఉద్యమం తప్పదన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేశాకే ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్ ప్రభుత్వం నేడు ఫలితాలు విడుదల చేస్తామనడం సరికాదన్నారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఆనంద్, శ్రీకాంత్, భాస్కర్, అనంతయ్య, శ్రీకాంత్, మల్లేశ్, బబ్లు పాల్గొన్నారు.

పెండ్లి కానుక బహూకరణ

కడ్తాల్, మార్చి 9: మండలంలోని నిరుపేద కుటుంబాలకు రాధాకృష్ణ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ అధినేత, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన కోశిక లక్ష్మమ్మ-జగన్ కురుమ కూతురు రోజా వివాహం శివతో ఆదివారం జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొన్న దశరథ్‌నాయక్... ట్రస్ట్ తరపున పెండ్లి కూతురుకి రూ.21 వేలతోపాటు పట్టుచీర, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ తరుపున పేదలకు ఇండ్ల నిర్మాణంతోపాటు, పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కడ్తాల్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతు సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహా, మాజీ ఉప సర్పంచ్ పాండూనాయక్, బీఆర